అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారంలోని వాయువిహార్ కాలనీలో యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు పంచాయతీ ఈఓ సంగీత స్థానిక నాయకులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి గ్రామపంచాయతీ నిధులు రూ. 30 లక్షలు కేటాయిస్తూ సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, సాయి చందర్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: మార్గశిరమాసం మంగళవారాన్ని పురస్కరించుకొని ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. ముఖ్యంగా వడ మాల, తమలపాకులతో ఆకుపూజ నిర్వహించా తమలపాకుల హారంతో అలంకారం చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి, ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అంతేకాకుండా ఆలయంలోని షిర్డీసాయిబాబా, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, గణపతికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

మహిళకు కుట్టు మిషన్ అందజేత

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎం.డీ గౌసియా బేగం భర్తను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. తనకు అండగా నిలవాలని ఎమ్మెల్యేను కోరగా.. కుట్టు మిషన్ కొనుగోలు చేసి అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రమోద్ గౌడ్, సత్తయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి

జిన్నారం (పటాన్‌చెరు): క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. మంగళవారం జిన్నారం మండల కేంద్రంలోని 37వ పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఏర్పుల వీరేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలకు గోదావరి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రతి పేదవాడి గడపకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు శాంతినగర్ కాలనీకి చెందిన ఓ యువతి (24) డిగ్రీ చదివి ఇంటివద్దే ఉంటుంది. ఈ నెల 22న ఆమె సోదరుడు చదివే పాఠశాలలో కార్యక్రమం ఉండటంతో ఆమె తల్లి, సోదరుడుతో కలిసి పాఠశాలకు వెళ్లింది. అనంతరం సాయంత్రం తల్లి, సోదరుడు ఇంటికి వచ్చారు. యువతి ఇంటికి రాలేదు. దీంతో యువతికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

పటాన్‌చెరుటౌన్: రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రూపేష్ పోలీసులకు పిలుపునిచ్చారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. బీడీఎల్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం దర్యాప్తులో ఉన్న కేసులను, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. బీడీఎల్ హైదరాబాద్ పరీవాహక ప్రాంతం కావడం వలన భూ సంబంధిత తగాదాలు అధికంగా ఉంటాయని, సివిల్ కేసుల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నిత్యం బీట్ డ్యూటీ, పెట్రోలింగ్ తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. తరచూ వాహనాల తనిఖీ చేపట్టి అనుమానిత వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకోవాలని సూచించారు.

డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో ఆల్ఫ్రాజోలం తయారీ, నిషేధిత గంజాయి, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ గ్యాస్ రీ-ఫిల్లింగ్, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రూపేశ్ స్పష్టం చేశారు. అన్ని అపార్ట్‌మెంట్‌లలో, పలు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం చాలా ముఖ్యమని ప్రతీ రోజు వ్యాయామం చేస్తూ ఫిట్‌గా ఉండాలని సూచించారు.

గత మూడేళ్లుగా గోపన్‌పల్లితండా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పరిస్థితి ఇది







దావత్ చేసుకునే సౌలత్ లేదు!

అందుబాటులోకి రాని గోపన్‌పల్లితండా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

- పనులు మిగిలి ఉన్నా హడావిడిగా గతేడాది ప్రారంభం
- నేటికీ ఒక్క ఫంక్షన్ నిర్వహించుకోలేని దుస్థితి
- కొత్త ఏడాదిలోనైనా అందుబాటులోకి తీసుకొస్తారా.?

రాయదుర్గం: అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెడితే ప్రజల దశ మారేను అనేది సుస్పష్టం. ఎందుకంటే ఇద్దరూ తలచుకుంటే ప్రజలకు ఎంతో మేలు చేకూరడం ఖాయం. కానీ ఇది 9 ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం విడ్డూరం. గచ్చిబౌలిలోని గోపన్‌పల్లి తండాలో మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ అందుబాటులోకి వస్తే సుమారు 20వేల మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కానీ తొమ్మిదేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు. కేవలం హాల్ మాత్రమే నిర్మించి వదిలేశారు. ఇది ఆకతాయిలకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి సౌకర్యం కరువే...

◆ మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ తొమ్మిదేళ్ల తర్వాత పూర్తి చేశామన్నారు. కేవలం హాల్ నిర్మాణం చేసి చేతులెత్తేశారు. కనీసం నీటి సౌకర్యం కూడా అవసరమైన మేరకు ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాకుండా హాల్ తప్ప చిన్నాపెద్దా ఫంక్షన్ ఏదైనా అన్నీ బయట టెంట్ హౌజ్ నుంచి తెచ్చుకోవాల్సిందే. ఈ విషయం తెలుసుకొని అంతా అవాక్కయ్యారని స్థానికులే పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు హడావుడిగా ఆరంభించినా ఇప్పటి వరకు ఒక్క ఫంక్షన్ కూడా జరగలేదు. దీనిని బట్టి అక్కడ సౌకర్యాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

రెండుసార్లు శంకుస్థాపనలు..

◆ గోపన్‌పల్లితండాలో 4 ఎకరాల స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఒక చరిత్ర ఏర్పడింది. 2015లో అప్పటి మంత్రి డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి రూ.1.70 కోట్లతో శంకుస్థాపన చేశారు. కొంత వరకు నిర్మాణం చేసి ఆరేళ్లు వదిలేశారు. ఆ తర్వాత నిర్మాణంలో జాప్యం కావడంతో నిధుల సమస్య తలెత్తడంతో రెండుసార్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అదనపు నిధులను రూ.1.72 కోట్లను కేటాయించి రెండోసారి అక్టోబర్ 6, 2023న మళ్లీ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభమయ్యేలా చేశారు. పనులు పూర్తి కావాల్సిన తరుణంలో హడావుడిగా గతేడాది ప్రారంభించారు.

◆ మొదటిసారి శంకుస్థాపన చేశాక ఫస్ట్ ఫ్లోర్, గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణం చేసి వదిలేశారు. రెండోసారి శంకుస్థాపన చేసిన తర్వాత గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ స్టీల్‌తో నిర్మాణం చేసిన దానికి గోడల నిర్మాణం, కిచెన్, మూత్రశాలలు, స్నానపుగదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, చేతులు కడుగుకోవడానికి ఏర్పాట్లు, కొత్తగా ప్రధాన గేటు, గ్రీనరీ, చుట్టూరా ప్రహరీ, ఇతర మౌలిక వసతులన్నీ కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మరికొన్ని పనులు చేయాల్సి ఉండగానే గతేడాది హడావుడిగా ప్రారంభించారు. మరికొన్ని పనులు చేయాల్సి ఉందని తాళం వేశారు. కానీ అవి ఏడాదైనా పూర్తి చేయలేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు.



గోపన్‌పల్లితండాలో 2016లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు నిలిచిన అనంతరం

స్థానికుల డిమాండ్లు ఇవే..

- ◆ తక్షణం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో మంచినీటి సౌకర్యం కల్పించాలి.
- ◆ పూర్తి స్థాయిలో ఫంక్షన్‌కు అవసరమైన సామగ్రిని కూడా అందుబాటులోకి తేవాలి
- ◆ ఆకతాయిలకు అడ్డాగా మార్చకుండా చూడాలి. చుట్టూరా ప్రహరీ నిర్మించాలి. ప్రధాన గేటుకు తాళంతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలను అడ్డుకట్ట వేయాలి.
- ◆ ఆన్‌లైన్‌లో బుక్ చేయడం కాకుండా స్థానికంగా అధికారిని నియమించి అక్కడే బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించాలి.
- ◆ మరింతగా గ్రీనరీ పెంచేలా చూసి ఇట్టే ఆకట్టుకునేలా తయారు చేయాలి.
- ◆ అన్ని రకాల సౌకర్యాలు కల్పించి 2025 నుంచి పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చేయాలని ముక్తకంఠంతో స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో 'నారాయణ' అదుర్స్



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణి

మాదాపూర్: నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో సత్తా చాటారు. అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. మంగళవారం మాదాపూర్‌లోని నారాయణ విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణిలు వివరాలను వెల్లడించారు. 2024 సంవత్సరంలో నారాయణ స్కూల్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో ఆస్ట్రానమీ, సైన్స్, మెథామెటిక్స్ విభాగాల్లో అంతర్జాతీయ పోటీపరీక్షలలో నారాయణ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. డిసెంబర్‌లో రుమేనియాలోని బుకారెస్టాలో జరిగిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్‌ఒలింపియాడ్స్‌లో శ్వేతాంక్ అగర్వాల్, భవ్య గున్నాల్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా అక్టోబర్‌లో నేపాల్‌లోని ఖట్మాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రోఫిజిక్స్‌లో ప్రాంజల్ దీక్షిత్ బంగారు పతకాన్ని, ఆగస్టులో బ్రెజిల్‌లో రియో డీ జెనీరోలో జరిగిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్, సీనియర్ విభాగంలో బనిబ్రతమజీ, సానిధ సరాఫ్‌లు రజత పతకాలను సాధించినట్టు తెలిపారు. వీటితో పాటుగా ఇండియన్ నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో దేశ వ్యాప్తంగా 1101 మంది ఎంపిక కాగా ఇందులో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అధికంగా 144 మంది ఎంపికయ్యారని సంతోషాన్ని వ్యక్తపరిచారు. అనంతరం విద్యార్థులకు పతకాలను, సర్టిఫికెట్‌లను అందజేసి ఘనంగా సన్మానించారు.

దివ్యాంగుల కోసం భవనం నిర్మించాలి

రాయదుర్గం: నియోజకవర్గంలో దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య ప్రతినిధులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షుడు ఎం.అశోక్‌కుమార్, ప్రతినిధులు రషీద్, వెంకటేష్ మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా సమైఖ్య సమావేశాలు జరుపుకుంటున్న తమకు భవనాలు లేక ఫుట్‌పాత్‌లు, చెట్ల కింద కూర్చొని మాట్లాడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అందుకోసం ప్రత్యేక దివ్యాంగుల భవనం నిర్మిస్తే ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అందుకు అవసరమైన స్థలం, నిధులు కేటాయించేలా చూడాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగుల పట్టణ సమాఖ్య ప్రతినిధులు

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పోచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణం, జాతర మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్, పీఏసీఎస్ చైర్మన్ భిక్షపతి, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, సీనియర్ నాయకుడు దశరథ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

చందానగర్: బీఎంఎస్ 70 సంవత్సరాల కార్మిక సంపర్క్ అభియాన్‌లో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌లోని చందానగర్ సర్కిల్ కార్మికులు, ఉద్యోగులను మంగళవారం కలిసి బీఎంఎస్ కరపత్రాల అందజేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో సుమారు రూ.40 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారన్నారు. వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. జీహెచ్ఎంసీలో పనిచేసే ఉద్యోగ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. ఉద్యోగుల పదోన్నతల విషయం వెంటనే అర్హులైన ఉద్యోగులందరికి పదోన్నతులు వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికుల హెల్త్ కార్డు రెన్యూవల్ వెంటనే చేయాలని బీమా డబ్బులు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు పెంచాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఖాళీగా ఉన్న వాటిని రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో పనిచేసే కార్మికుల ఉద్యగుల సమస్యలను వెంటేన పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ అధ్యక్షులు ఇక్బాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీఎంఎస్ కరపత్రాల అందజేస్తున్న యూనియన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు

ఘనంగా ఎల్లమ్మతల్లి కల్యాణం

జిన్నారం (పటాన్‌చెరు):జిన్నారం గ్రామానికి చెందిన గవిండ్ల వెంకట్ రెడ్డి నివాసంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశంగౌడ్, ప్రతాప్ రెడ్డి, మురళి, వీరారెడ్డి, భోజిరెడ్డి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్.. కేసు నమోదు

గచ్చిబౌలి: బైక్‌పై వెనక నుంచి వచ్చిన దుండగులు వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోంచి బంగారు చైన్ లాక్కొని ఉడాయించిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టినాగులపల్లికి చెందిన సునీత సింగ్(56) మంగళవారం ఉదయం 7.30గంటల సమయంలో ఔటర్ సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తోంది. వెనక నుంచి బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు మెడలోని బంగారు చైన్ లాగారు. ఆమె చైన్ వదలకుండా పట్టుకోవడంతో కొంత భాగాన్ని లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమీప ప్రాంతాలలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రానికి చెందిన హతుల్ బోరా(36). భార్య స్వప్న బోరాలతో కలిసి మయూరినగర్‌లో నిసాముంటున్నారు. 27న నగరానికి వచ్చి మియాపూర్‌లోని బొల్లారం శివాలయంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.ఈ క్రమంలో హతుల్ బోరా భార్య స్వప్నబోరా స్నేహితురాలితో కలిసి చార్మినార్, ఇతర ప్రదేశాలకు వెళ్లమని హతుల్ బోరా పంపించాడు. ఆ తర్వాత ఒక్కడే ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి మధ్యాహ్నం సమయంలో వారు ఉంటున్న గది ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో స్థానికులతో కలిసి కిందికి దించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే హతుల్ బోరా మృతి చెంది ఉన్నాడు. హతుల్ బోరా మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య స్వప్నబోరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పెన్షనర్ల క్యాష్‌లెస్ హెల్త్‌స్కీమ్ అమలుకు కృషి

గచ్చిబౌలి: ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్ అమలయ్యేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని టీఎన్‌జీవోస్ ఫేజ్-2లో తెలంగాణ గవర్నమెంట్ ఉమెన్స్ పెన్షనర్స్ ఫోరం అధ్వర్యంలో తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన కవులు, గేయ రచయితలు, మేధావులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ మాట్లాడుతూ.. మనం ఏ ఉద్దేశ్యంతో తెలంగాణ సాధించుకున్నామో అందుకు విరుద్ధంగా గత పదేళ్లు మోసపోయామన్నారు. తెలంగాణ సాధనకు ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రముఖ శిల్పి ఎక్కె యాదగిరిరావు మాట్లాడుతూ.. 1974లో తాను నిర్మించిన అమరవీరుల స్థూపాన్ని 50 ఏళ్లుగా జాతికి అంకిత చేయకుండా 369 మంది అమరవీరుల ఆత్మ క్షోభ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 జూన్ 2 నాటికైనా అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, తెలంగాణ గవర్నమెంట్ ఉమెన్స్ పెన్షనర్స్ ఫోరం చైర్‌పర్సన్ ఉమాదేవి, కన్వీనర్ నాగలాంబ, కో-చైర్‌పర్సన్ ధనలక్ష్మి, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేందర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌జీఓకాలనీలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

మున్సిపాలిటీలో కలపాలని విజ్ఞప్తి



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): నూతనంగా ఏర్పాటు కానున్న గడ్డపోతారం మున్సిపాలిటీలో నల్తూరు గ్రామాన్ని కలపాలని గ్రామస్తులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన నివాసంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌తో కలిసి గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. నూతన మున్సిపాలిటీలో గ్రామాన్ని కలపడం వల్ల అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజు, పర్వతాలు, భీమ్రావు, రమేష్, నాగభూషణం చారి, నర్సింగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ మల్లికార్జున్‌గౌడ్‌కి నివాళి

శేరిలింగంపల్లి: కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ మల్లికార్జున్‌గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి నల్లగండ్లలో మంగళవారం నిర్వహించారు. స్వర్గీయ మల్లికార్జున్ సమాధి వద్ద పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, మల్లికార్జున్ భార్య భాగ్యలక్ష్మీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. స్వర్గీయ మల్లికార్జున్ జీవితం యువతకు ఆదర్శం అన్నారు. ఆరు సార్లు ఎంపీగా, పలు శాఖలకు మంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఆయా పదవులకు వన్నె తెచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీఎన్ చారీ, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, రవీందర్ గౌడ్, నరేందర్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.



మల్లికార్జున్‌గౌడ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఆరికెపూడి గాంధీ, భాగ్యలక్ష్మి, జగదీశ్వర్‌గౌడ్

వినియోగదారులు మోసపోతే ఫిర్యాదు చేయండి

- తెల్లకాగితంపై ఫిర్యాదు రాసిచ్చినా చర్యలు తీసుకుంటాం
- ప్రముఖ వ్యాపారవేత్త పద్మశ్రీ నర్రా రవికుమార్
- 'టీహబ్'లో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



టీహబ్‌లో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్'ప్రాంగణంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త పద్మశ్రీ నర్రా రవికుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు తమ హక్కుల గురించి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్‌లో ఎక్కడైనా ఏదైనా కొనుగోలు చేస్తే విధిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఏదైనా వినియోగదారుడు మోసపోయినట్లుగా భావిస్తే తెల్లకాగితంపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులు, ఉత్పత్తుల్లో నాసిరకం ఉంటే వినియోగదారుల కోర్టుకు వెళ్లి న్యాయం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు.

◆ వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌బాబు మాట్లాడుతూ.. వినియోగదారులు తమ హక్కులను గుర్తించి కొనుగోలు చేసిన దాంట్లో నాసిరకం ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. వస్తుసేవల విషయంలో సమస్యలు తలెత్తితే జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి కమిషన్లను ఆశ్రయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అదనపు కలెక్టర్ ప్రసాద్, లీగల్ మెట్రోలాజికల్ శాఖ డీఎల్ఎం శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ అధ్యక్షుడు నిర్మల్ చౌదరి, తెలంగాణ ఉపాధ్యక్షుడు రమేష్, అరుణ, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు తదితరులు పాల్గొన్నారు.